

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య



పాంప్లెట్ ఇస్తున్న అధ్యాపకులు

మంచాల, మే 16 : ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య బోధిస్తున్నామని మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య అన్నారు. అధ్యాపకులతో కలిసి గురువారం ఆరుట్ల, మంచాలల్లో విద్యార్థులను కలిసి తమ కాలేజీలో చేరాల్సిందిగా సూచించారు. తమ కాలేజీలో నిపుణులైన అధ్యాపకులతో బోధిస్తున్నామని, పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు ఇస్తామని వివరించారు.



ధారూరు: నాగారం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

నాగారంలో తడిసిన ధాన్యం కుప్ప



కీసరలో కురుస్తున్న వర్షం

అకాలం ఆగమాగం!

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు

- రాజేంద్రనగర్‌లో అత్యధికంగా 6.2 సెం.మీ నమోదు
- కడ్తాల్ మండలంలో పిడుగు పాటుకు ఒకరి మృతి
- కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం.. అన్నదాతల ఆందోళన
- రోడ్లపై వరద ప్రవాహం.. పొంగిన డ్రైనేజీలు.. ఇళ్లలోకి చేరిన నీరు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం కురిసింది. వర్ష బీభత్సంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. కడ్తాల్‌లో పిడుగుపడి ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. పరిగిలో గోడ కూలి 15 మేకలు మృతి చెందాయి. అకాల వర్షంతో కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. అనేక చోట్ల కూరగాయ పంటలతో పాటు మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. కాగా ఉదయం నుంచి ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన జనం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గురువారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నగర శివార్లలోని పలు ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురిసింది. ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపు వర్ష బీభత్సంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. కడ్తాల్‌లో పిడుగుపడి ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. పరిగిలో గోడ కూలి 15 మేకలు మృతి చెందాయి. అకాల వర్షంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద బయట ఉన్న ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. అనేక చోట్ల కూరగాయ పంటలతో పాటు మామిడి పంటకు నష్టం వాటిల్లింది. ఇదిలా ఉంటే ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజానీకం వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందుతున్నారు. మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. వానాకాలం సీజన్ రాక ముందే వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ముందుగానే మొదలు పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. కడపటి సమాచారం మేరకు ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా రాజేంద్రనగర్‌లో 6.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. అలాగే బాలానగర్‌లో 6.1 సెం.మీ, శేరిలింగంపల్లిలో 6 సెం.మీ, సరూర్‌నగర్‌లో 5.23 సెం.మీ, మల్కాజిగిరిలో 5 సెం.మీ, కూకట్‌పల్లి, కాప్రా, ఉప్పల్‌లో 4.6 సెం.మీ, కుత్బుల్లాపూర్‌లో 4.4 సెం.మీ, హయత్‌నగర్ 3.4 సెం.మీ, శామీర్‌పేట 3సెం.మీ, గండిపేట 2.9 సెం.మీ, పూడూరులో 2.5 సెం.మీ, శంకరపల్లిలో 2.2 సెం.మీ వర్షం కురిసింది.

పిడుగు పడి ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు

కడ్తాల మండలం వాసుదేవ్‌పూర్ గేటు వద్ద పిడుగు పాటుకు ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. వర్షం కురుస్తున్న సమయంలో కడ్తాల నుంచి బైక్‌పై వెళ్తున్న మాడ్గుల మండలం కలకొండకు చెందిన కార్పెంటర్ పసునూరి ప్రవీణ్‌చారి(32), అతని మామ నాగోజు జంగాచారి వాస్‌దేవ్‌పూర్ గేటు వద్ద ఉన్న బస్‌షెల్టర్‌లో నిల్చునేందుకు వెళ్తున్నారు. అదేసమయంలో పక్కన ఉన్న చెట్టుపై పిడుగు పడగా ప్రవీణ్‌చారి అక్కడికక్కడే మృతి చెందాడు. షెల్టర్‌లోకి వెళ్లిన అతడి మామ జంగాచారి స్వల్పంగా గాయపడ్డాడు. కాగా ఏడాది క్రితం ప్రవీణ్‌చారికి జంగాచారి కూతురితో వివాహమైంది. అప్పటికే బస్‌షెల్టర్‌లో ఉన్న పెద్దమాడ్గులకు చెందిన గౌని నిరంజన్ పిడుగు శబ్దానికి కిందపడి గాయపడ్డాడు. అదే సమయంలో బస్ షెల్టర్‌లో మరో 7మంది వాసుదేవ్‌పూర్ గ్రామానికి చెందిన కూలీలు, ప్రయాణికులు త్రుటిలో ప్రమాదం నుంచి బయట పడ్డారు. గౌని నిరంజన్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని కడ్తాల సీఐ శివప్రసాద్ సందర్శించి వివరాలు సేకరించారు. వాసుదేవ్‌పూర్ ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, రాంనుంతల మాజీ సర్పంచ్ శ్రీనునాయక్ చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

మేడ్చల్ జిల్లాలో..

ఘట్‌కేసర్/కీసర/కీసర రూరల్ : కీసరలో భారీ వర్షం కురిసింది. ఎండ, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్న జనాలు కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ఉరుములు, మెరుపులు రావడంతో విద్యుత్ అధికారులు ముందస్తుగా సరఫరాను నిలిపివేశారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో మోస్తరు వర్షం కురిసింది. దాదాపు అరగంట పాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల ఈదురుగాలులతోపాటు ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిశాయి. ఈదురుగాలులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



వాసుదేవ్‌పూర్ గేట్ వద్ద పిడుగుపాటుకు మృతి చెందిన ప్రవీణ్‌చారి

జలమయం.. ఇళ్లలోకి నీరు

చేవెళ్ల/కేశంపేట/ఇబ్రహీంపట్నం/యాచారం/కందుకూరు/ఆమనగల్లు/కడ్తాల్ :

యాచారం మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పలు ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. కొత్తపల్లిలోని ఇళ్లలో వరద నీరు రావడంతో జాగారం తప్పదని దశరథ అనే వ్యక్తి ఆందోళన చెందారు. సామగ్రితో పాటు దుస్తులు కూడా తడిచిపోయినట్లు బాధితులు వాపోయారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో గంట పాటు ఈదురుగాలులు, ఉరుములతో వర్షం కురిసింది. ఆలూర్‌లో వర్షానికి పలు వార్డుల్లో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ఇళ్లలోని వాననీరు చేరింది. కేశంపేట మండలంలో కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఎండబోయడంతో రైతులు ఆందోళన చెందారు. ఇబ్రహీంపట్నంతో పాటు రూరల్‌లో మోస్తరు వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. యాచారం మండలం మేడిపల్లి, గున్‌గల్, మాల్, చిన్నతూండ్ల, ఏనెకిందితండా, కందుకూరు మండంలోని పులిమామిడి, కొత్తగూడ, జైత్వారం, నేదునూరు, కందుకూరు, రాచులూరు, లేమూరు, కొత్తూరు, అగర్‌మియాగూడ, సరస్వతిగూడ గ్రామాల్లో వర్షం కురిసింది. ఆమనగల్లు పట్టణం, మండల పరిధి గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడి వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. విఠాయిపల్లిలో పంట పొలాల్లో వర్షం నీరు చేరింది. పలుచోట్ల కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



ఆలూర్ గ్రామంలో ఇంట్లో వర్షం నీటిని ఎత్తిపోస్తున్న మహిళ

పడిపోయిన ఉష్ణోగ్రతలు

వాతావరణ మార్పులతో ఉమ్మడి జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మూడు జిల్లాల్లో కూడా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలలోపే నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లా గండిపేటలో అత్యధికంగా 38.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో 38.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా వికారాబాద్ జిల్లా నవాబుపేటలో 39.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక రాత్రిపూట ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. కందుకూరు, కడ్తాల్ మండలాల్లో 20 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అనేక మండలాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20 నుంచి 25 డిగ్రీలలోపుగానే నమోదయ్యాయి. గడిచిన నెల రోజుల్లోనే పగటి, రాత్రిపూట ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు కావడం గమనార్హం.

తడిసిన ధాన్యం

చేవెళ్లలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గొల్లపల్లికి చెందిన వెంకటేశ్‌గౌడ్ వడ్లు ఎండబోయగా వర్షానికి తడిశాయి. వరదకు ధాన్యం కొట్టుకుపోయింది. ధారూరు మండలం నాగారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం చేసిన దాదాపు 500 బస్తాలతో పాటు రైతులు విక్రయించటానికి తెచ్చిన ధాన్యం బస్తాలు వర్షానికి తడిసిపోయాయి. వర్షానికి తడవకుండా ధాన్యం సంచులపై పాలిథిన్ కవర్లు కప్పినా వరదనీరు సంచుల కింద నుంచి ప్రవహించి ధాన్యం తడిసిపోయింది. కాగా జీడిగడ్డ తండాలో రైతులు ఆరుబయట ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసిపోవటంతో బస్తాల్లో ఎత్తటానికి అవస్థలు పడ్డారు. కోతలు కోయకుండా పొలాలలో ఉన్న వరి పంట వర్షం దాటికి నేలవాలి నష్టం వాటిల్లిందని నాగారం, మోమిన్‌కలాన్ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దోమ మండలంలోని బొంపల్లి, బాసుపల్లి, గోడుగోనిపల్లి తదితర గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయింది. బొంపల్లి గ్రామానికి చెందిన బెస్త మొగులమ్మ ఇంటి ముందు ఆరబోసిన ధాన్యం అకాల వర్షానికి తడిసిపోవడంతో చేతికొచ్చిన పంట దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేసింది.

గోడ కూలి 15 మేకలు మృతి.. మరో ఆరింటికి గాయాలు



పరిగిలో గోడకూలి మృతి చెందిన మేకలు

ఆంధ్రజ్యోతి, వికారాబాద్ దోమ/వికారాబాద్/ధారూరు/యాలాల/పరిగి: పరిగిలో వర్షానికి ప్రహరీ గోడ కూలి 15 మేకలు మృతి చెందగా, మరో ఆరుంటికి కాళ్లు విరిగాయి. పరిగి పట్టణానికి చెందిన లింగని రమేశ్‌కు చెందిన మేకల గుంపు తహసీల్దార్ కార్యాలయం వెనకాల నిర్మించిన గోడ దగ్గర నిలిచి ఉన్నాయి. వర్షానికి గోడ కూలి మేకలపై పడింది. దీంతో 15 మేకలు మృతి చెందాయి. మరో ఆరు మేకలకు కాళ్లు విరిగాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

నాగారంలో ...

ధారూరు మండల పరిధిలోని నాగారంతో పాటు పరిసర గ్రామాల్లో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అనంతగిరి అడవిలో ప్రాంతంలో భారీ వర్షం పడగా వికారాబాద్ లో చినుకులతో కూడిన వర్షం పడింది. దీంతో రోడ్లపైకి చినుకు వచ్చి చేరడంతో వాతావరణం పూర్తిగా చల్లబడి పోయింది. సెలవులు ఉండడం, ఎన్నికలు పూర్తి కావడంతో చల్లటి వాతావరణంలో ప్రజలు బయటకు వచ్చేందుకు ఇష్టపడడం కన్పించింది. యాలాల మండలంలో మోస్తరు వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోయింది. రాస్నాం, పగిడ్యాల్, అచ్యుతాపూర్, నాగసమందర్, ఇస్నాపూర్, యాలాల, సంగెంకుర్దు, బెన్నూర్ తదితర గ్రామాల్లో వర్షం కారణంగా ధాన్యం తడిసి పోయింది.



రాస్నంలో తడిసిన ధాన్యం బస్తాలు

వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ రూములను పరిశీలించిన కలెక్టర్



వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

చేవెళ్ల, మే 16 : వెబ్ క్యాస్టింగ్ ద్వారా స్క్రీనింగ్ రూమ్‌లను చేవెళ్ల పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి శశాంక పరిశీలించారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని గొల్లపల్లిలో ఉన్న బండారు శ్రీనివాస్ ఇంజినీరింగ్ కళాశాలలో పోల్డ్ ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను ఈ ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపర్చారు. ఈవీఎంలకు వేసిన సీళ్లను సీసీ కెమెరాల ద్వారా అర్వో పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలు, వాటి పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను గమనించారు. నిఘా కోసం అమర్చిన క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల పనితీరు, వాటి ద్వారా కొనసాగుతున్న పర్యవేక్షణను పరిశలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట చేవెళ్ల, కందుకూర్ ఆర్డీవోలు సాయిరామ్, సూరజ్‌కుమార్, చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్, తహసీల్దార్ కృష్ణయ్య, సీఐ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాలు

మంచాల, మే 16: మంచాలలో గల శ్రీ భద్రకాళి వీరభద్రస్వామి ఆలయంలో ఈ నెల 18న(శనివారం) నుంచి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. రేపు అభిషేకం, అఖండ దీపారాధనలతో ఉత్సవాలు మొదలై ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం తెలిపారు. 19న రుద్రహోమం, కల్యాణమహోత్సవాలుంటాయని, 20న ముగింపు పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు తరలిరావాలని వారు కోరారు.

సంతృప్తికరంగా ఉపాధి పనులు

- కూలీలకు వారవారం వేతనాలందిస్తున్నాం
- ఉపాధి కల్పించడం లేదనే భావన కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం : డీఆర్‌డీఏ పీడీ శ్రీలత



యాచారంలో నర్సరీని తనిఖీ చేస్తున్న పీడీ శ్రీలత

యాచారం, మే 16 : జిల్లాలో ఉపాధి పనులు బాగా జరుగుతున్నాయని, సరిహద్దు కందకాల తవ్వకం పనులు నాణ్యతతో చేయిస్తున్నామని జిల్లా డీఆర్‌డీఏ పీడీ శ్రీలత పేర్కొన్నారు. వారం వారం కూలీల ఖాతాల్లో వేతనాలు జమ చేయిస్తున్నట్లు ఆమె చెప్పారు. హరిత హారం నర్సరీల్లో మొక్కల సంరక్షణపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం యాచారం మండలం చింతపట్ల, యాచారం, మొండిగౌరెల్లి గ్రామాల్లో ఆమె పర్యటించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. వానాకాలంలో పొలాల్లోని వరద నీరు వృథాగా పోకుండా ఎక్కడికక్కడ కమతాల సరిహద్దుల్లో కందకాలను తవ్వాలని కూలీలను ఆదేశించారు. పనులు నాణ్యతగా చేయాలన్నారు. పనిచేస్తున్న చోట టెంట్‌లు, మెడికల్ కిట్లు ఉన్నాయా? అని కూలీలనడిగి తెలుసుకున్నారు. సరిపడా తాగు నీటిని ఉంచాలని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు.ఎప్పటికప్పుడు తేడాలు రాకుండా కొలతలు తీసుకోవాలన్నారు. జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తక్షణమే కార్డిచ్చి పని చూపాలని ఏపీవో లింగయ్యను ఆదేశించారు. హరితహారం నర్సరీల్లో మొక్కలెండకుండా చూడాలన్నారు. ఇప్పటికే నాటిన మొక్కలు ఎండితే వాటి స్థానం లో మళ్లీ మొక్కలు నాటించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. జిల్లాలో రోజుకు సరాసరి 27వేల నుంచి 30వేల మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారని ఆమె తెలిపారు. ఎక్కడ కూలీల వేతనాలు పెండింగ్‌లో లేవన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తా : డీఆర్‌డీఏ పీడీ

విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తామని, కూలీలకు పనులు చూపడంతో పాటు కొలతల్లో, రికార్డుల్లో తేడా లేకుండా డ్యూటీ చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీలత ఉపాధి హామీ సిబ్బందిని హెచ్చరించారు. గ్రామాల్లో పర్యటనానంతరం మండల పరిషత్‌లో ఫీల్డ్/టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కూలీలు చేసిన పనులను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. వాస్తవ పనికి, రికార్డులకు వ్యత్యాసం ఉండకూడదన్నారు. మస్టర్లపై కూలీల సంతకాలు లేకుండా పని ఎలా చేయించారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంబీ రికార్డులు సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవన్నారు. సోషల్ ఆడిట్‌లో తేలిన తప్పులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కరెక్టుగా డ్యూటీ చేస్తే పొరపాట్లు దొర్లవన్నారు. అంకితభావంతో పని చేయకుంటే బదిలీ లేదా సస్పెండ్ చేయడం ఖాయమన్నారు. సమావేశంలో ఏపీడీ సక్రియ, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఏపీవో లింగయ్య, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



చింతపట్లలో కూలీలు పనిచేస్తున్న చోట పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీలత

వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆహ్లాదకరంగా అరటి చెట్లు



ఆలయ ద్వారానికి ఇరువైపుల అరటి చెట్లు

షాద్‌నగర్‌అర్బన్, మే 16: షాద్‌నగర్ శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పెంచిన అరిటి చెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అరటి మొక్కలు ఏపుగా ఎదిగి ఫలాలను ఇస్తున్నాయి. భక్తులకు నీడనిస్తూ, సెల్ఫీలు తీసుకునేలా ఉల్లాసాన్ని కల్గిస్తున్నాయి. ఆలయ అభివృద్ధిని పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు సూచన మేరకు షాద్‌నగర్‌కు చెందిన న్యాయవాది బి.జగన్‌మోహన్‌రెడ్డి సొంత ఖర్చులతో రాజమండ్రి నుంచి అరటి మొక్కలను తెప్పించి నాటించారు. ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం చుట్టూ, ప్రధాన ఆలయదారులకు ఇరువైపులా అరటి మొక్కలు నాటించారు. మొక్కలకు డ్రిప్‌లు ఏర్పాటు చేసి నీరందిస్తూ సంరక్షించారు. మొక్కలు ఏపుగా పెరిగి పెద్దపెద్ద గెలలను ఇస్తున్నాయి. వాటిని దేవుడికి నైవేద్యంగా సమర్పించి, భక్తులకు ప్రసాదంగా ఇవ్వడానికి వీలుగా చక్కరకేళి రకం మొక్కలను నాటారు. ఆలయ ఉత్సవాలకు సైతం ఈ మొక్కల పిలకలను ఉపయోగిస్తున్నారు. మొట్టమెదటి అరటి గెలను గురువారం ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసాచార్యులకు బక్కని నర్సింహులు అందజేశారు. చెట్టుపైనే పండ్లుగా మారిన అరటిపండ్లను దేవుడికి నైవేద్యం సమర్పించిన పిదప భక్తులకు పంచారు.



మొదటి అరటిగెలను నైవేద్యం కోసం అందజేస్తున్న బక్కని నర్సింహులు

కోతికొమ్మచ్చి గుర్తుందా..?

● పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో ఆటల్లో మునిగితేలుతున్న చిన్నారులు

పెద్దేముల్, మే 16: వేసవికాలం పాఠశాలకు సెలవులు కావడంతో చిన్నారులు ఆటపాటల్లో మునిగిపోయారు. మండలంలోని చైతన్యనగర్‌లో పిల్లలు గోళీలాట, కోతికొమ్మచ్చి వంటి ఆటలు ఉత్సాహంగా ఆడుతూ ఆంధ్రజ్యోతి కంటపడ్డారు. ఈ కోతికొమ్మచ్చి ఆడే విధానంపై ఒక లుక్కేద్దాం.. పిల్లలు అందరు చెట్టుపైన ఎక్కి కూర్చుంటారు. ఇద్దరు పిల్లలు చెట్టుకింద ఉంటారు. అందులో ఒకరు చెట్టుపైకి ఎక్కిన వారిని పట్టుకునే వారు. మరొకరు ఆడించే వారు. చెట్టు కింద ఉన్న ఇద్దరిలో ఒకరు తన ఒకకాలును పైకి ఎత్తి ఆ కాలు కిందనుండి కర్రను బలంగా విసురుతాడు. మిగతా పిల్లాడు పరుగెత్తుకుంటూ వెళ్లి ఆకర్రను తీసుకురావాలి. చెట్టుకింద గుండ్రంగా గీసిన గీతలోపల ఆకర్రను వేసి చెట్టుపైన ఎక్కిన వారిని పట్టుకోవాలి. చెట్టుపైన ఎక్కిన పిల్లల్లో ఎవరినైనా ఒకరిని పట్టుకుని ఔట్ చేయాలి. కర్రను తీసుకువచ్చిన పిల్లాడు ఆకర్రను చెట్టుకింద గీసిన ఆగీతలోపల వేసి చెట్టుఎక్కి వారిని పట్టుకోబోతే చెట్టుపైన ఉన్న వారెవరైనా ఇంకోవైపు నుంచి వచ్చి ఆకర్రను తొక్కితే చెట్టుపైన ఉన్న పిల్లలను పట్టుకునేందుకు ప్రయత్నం చేసిన పిల్లాడే తిరిగి ఔటైనట్లు అలా మళ్లీ కర్రను విసరడం ఆపిల్లాడు దానిని తీసుకురావాలి. పిల్లలంతా ఈ ఆటను ఉత్సాహంగా కేరింతలు కొడుతూ ఆటాడుకుంటున్నారు. ఇటీవల కాలంలో పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోన్‌లో గేమ్స్‌కు అతుక్కుపోతున్నారు. ఇలాంటి సమయంలో గ్రామీణ ప్రాంతంలో ఉండే పిల్లలు కోతికొమ్మచ్చి వంటి ఆటలను ఆడటం మంచి పరిణామమని చెప్పవచ్చు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఇలాంటి ఆటలు ఆడేవిధంగా చూడాలని మానసిక నిపుణులు అంటున్నారు. దీని ద్వారా వారు శారీరంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని చెబుతున్నారు.


ఆటలో భాగంగా కర్రను విసురుతున్న బాలుడు


చైతన్యనగర్‌లో కోతికొమ్మచ్చి ఆడుతున్న చిన్నారులు

కంకర వేసి.. తారు మరిచి

● ఆరు నెలలుగా ప్రయాణికులకు తప్పని తిప్పలు
● పట్టించుకోని సంబంధిత అధికారులు

బషీరాబాద్, మే 16: బషీరాబాద్- తాండూరు ప్రధాన మార్గం అగ్గనూరు సమీపంలో డబుల్ రోడ్డు కొంత మేరకు పూర్తిగా దెబ్బతినడంతో ఆరు నెలల కిందట తొలగించారు. ఈ రోడ్డును కొత్తగా వేసేందుకు కిలోమీటరు మేర మధ్య మధ్యలో బీటీ రోడ్డును కాంట్రాక్టర్ తొలగించి కంకర పరిచే పనులు చేపట్టారు. ఈ కంకర వేసి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. ఈ మార్గంలో పరిచిన కంకరతో ముందు వెళ్తున్న వాహనాలతో దుమ్ము లేచి దిచక్రవాహనదారులపై పడి ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో ఉవ్వెత్తున వెలువడే కంకర దుమ్ముతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనాదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


బషీరాబాద్-తాండూరు మార్గంలో అగ్గనూరు వద్ద కంకర తేలిన రోడ్డు

వయో భారం.. బతుకు పోరాటం!

● ఆదర్శంగా నిలుస్తున్న వృద్ధురాలు

బషీరాబాద్, మే 16: ఈ వృద్ధురాలి పేరు కొత్త పాపమ్మ. వయస్సు 82 సంవత్సరాలు. కొన్నేళ్ల కిందట భర్త మృతిచెందాడు. ఈమెకు కూతురు, అల్లుడు, మనువాళ్లు ఉన్నా ఆమెకు బతుకు పోరాటం తప్పడంలేదు. మండలంలోని నవాల్గ గ్రామానికి చెందిన పాపమ్మ కూతురి కుటుంబాన్ని తన ఇంట్లోనే పెట్టుకుని వారికి చేదోడువాదోడుగా ఉంటోంది. ఎండను లెక్క చేయకుండా వచ్చి కానుగచెట్టు వద్ద కూర్చుని కాయలుఏరి గింజలను తీస్తూ 'ఆంధ్రజ్యోతి' కంటపడింది. ఎనిమిది పదుల వయస్సులోనూ ఎవరిపైనా ఆధారపడకుండా తన కాళ్లపై తాను జీవిస్తున్న ఈ వృద్ధురాలు ఎందరికో ఆదర్శమని చెప్పవచ్చు.


బషీరాబాద్-తాండూరు మార్గంలో కానుగగింజలు తీస్తున్న వృద్ధురాలు

తంగడ్‌పల్లి అభివృద్ధికి సహకరించండి


సీఎం రేవంత్‌రెడ్డితో పాండుయాదవ్


చేవెళ్ల, మే 16 : మండల పరిధిలోని తంగడ్‌పల్లి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు పాండుయాదవ్ కోరినట్లు తెలిపారు. ఈమేరకు ఆయన గురువారం నగరంలోని దస్పల్లా హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ సమావేశం నిర్వహించారు. పాండుయాదవ్, నాయకుడు మాణిక్యంతో పాటు పలువురు సోషల్ మీడియా విభాగం నాయకులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశం అనంతరం నాయకులు తంగడ్‌పల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. గ్రామంలో వాగులపై బ్రిడ్జిలు నిర్మించడంతో పాటు రోడ్లను బాగు చేయాలని సీఎంను కోరినట్లు చెప్పారు. తంగడ్‌పల్లికి 200 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసి సహకరించాలని కోరినట్లు పాండుయాదవ్ తెలిపారు. ఈమేరకు సీఎం సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. ఆయనతో పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

భూకబ్జాలపై ఉక్కుపాదం


కబ్జా చేసిన రోడ్డును తొలగింపజేస్తున్న తహసీల్దార్ నాగమణి

శంషాబాద్ రూరల్, మే 16 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో భూ కబ్జాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపినట్లు తహసీల్దార్ నాగమణి తెలిపారు. మండల పరిధిలోని నర్కూడ సుంతరోని చెరువు 20 ఎకరాల్లో విస్తరించి ఉంది. అయితే, ఇటీవల కొందరు అక్రమార్కులు కబ్జాచేసి ఏకంగా అర ఎకరాకు పైగా కబ్జాచేసి మట్టి రోడ్డును నిర్మించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సిబ్బందితో కలిసి గురువారం రోడ్డును ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఆమె మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ భూమిని కబ్జా చేసినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కబ్జాల వెనకల రాజకీయ నాయకులు ఉన్నారని, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన శేరిగూడ మాజీ సర్పంచ్


కేటీఆర్‌తో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఉపసర్పంచ్ ఇంద్రసేనారెడ్డి

శంకర్‌పల్లి, మే 16: బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు మరింత కృషి చేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శేరిగూడ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఉపసర్పంచ్ ఇంద్రసేనారెడ్డిలు గురువారం నగరంలోని కేటీఆర్ నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. శంకర్‌పల్లిలో బీఆర్ఎస్ పార్టీ స్థితిగతులను కేటీఆర్‌కు వివరించినట్లు వారు తెలిపారు. కష్టకాలంలో ఉన్న నాయకులు, కార్యకర్తలు ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇతర పార్టీ నాయకులు పార్టీలోకి వచ్చి లాభం పొందారని, ప్రస్తుతం అధికారం కోల్పోగానే ఎంతోమంది పార్టీని వీడారని కేటీఆర్‌కు చెప్పినట్లు వారు పేర్కొన్నారు. చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీగా భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని తెలిపినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, ప్రసాద్, యాదగిరి, యూత్ సభ్యులు తదితరులున్నారు.

అంధకారంలో గ్రామాలు

● అప్రకటిత కరెంటు కోతలతో ఇక్కట్లు
● రాత్రంతా కరెంటు కట్
● ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన జనం

తాండూరు రూరల్, మే 16: అప్రకటిత విద్యుత్ కోతలతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నపాటి గాలి వీచినా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. గంటల తరబడి విద్యుత్ అంతరాయం కలుగుతుండటంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాండూరు మండల పరిధిలోని మిట్టబాస్పల్లి, గుంత బాస్పల్లి గ్రామాల్లో కరెంటు సరఫరాను బుధవారం రాత్రి 9గంటలకు నిలిపివేసి తిరిగి గురువారం ఉదయం 11గంటలకు పునరుద్ధరించారు. ఒక్కరోజు రాత్రంతా ఆ రెండు గ్రామాలు అంధకారంలో మగ్గాయి. గ్రామాల ప్రజలు రాత్రి ఉక్కపోతతో నిద్రలేక అవస్థలు పడ్డారు. గంటల తరబడి విద్యుత్ నిలిపివేస్తే ఎలా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రోజూ గంటల తరబడి అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎప్పుడు తీస్తారో ఎప్పుడు పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. చిన్నపాటి గాలి వీచినా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో తాగునీటికి కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని వారంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలు విధించరాదని, ముఖ్యంగా రాత్రివేళల్లో విద్యుత్ అంతరాయం కలిగించొద్దని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కులకచర్ల: చిన్నపాటి గాలి వీచిందంటే చాలు విద్యుత్ శాఖ అధికారులు సరఫరాను నిలిపి వేస్తుండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పుట్టపహడ్‌లో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు కులకచర్ల, ముజాహిద్‌పూర్, బండవెల్కిచర్ల గ్రామాల్లో 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్నా విద్యుత్ సరఫరాలో అంతరాయం తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. గతంలో ఎంతటి ఈదురుగాలులతో కూడిన వర్షాలు వచ్చినా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండేది కాదని, ప్రస్తుతం చీటికీ మాటికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న పరిస్థితులు దాపరించాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల కింద ఉన్న విద్యుత్ తీగలు తొలగించకపోవడంతో తరచూ అంతరాయం ఏర్పడుతుంది. బుధవారం సాయంత్రం కురిసిన తేలికపాటి వర్షానికి మూడు గంటలు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

దేశప్రజలంతా బీజేపీ వైపే: ఈటల

కీసర రూరల్, మే 16: దేశప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని మాజీ మంత్రి, బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మున్సిపల్ పరిధి బీజేపీ నాయకులు గురువారం ఈటల రాజేందర్‌ను ఆయన స్వగృహంలో కలిసారు. చైర్మన్ చంద్రారెడ్డి ఈటల రాజేందర్‌కు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో మల్కాజ్‌గిరి నియోజక వర్గంలో ఊహించని రీతిలో బీజేపీకి మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నాగారం మున్సిపల్ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, జూపల్లి నరేందర్, సురేష్, సూర్య శేఖర్‌రెడ్డి, కిషోర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ కార్యకర్తలతో ఈటల రాజేందర్

శరవేగంగా వికారాబాద్ రైల్వే స్టేషన్

ఆధునికీకరణ పనులు

- ఇప్పటికే రూ.24.35కోట్లు మంజూరు
- ఫిబ్రవరిలో వర్చువల్‌గా ప్రారంభించిన పీఎం మోదీ
- తీరనున్న ప్రయాణికుల కష్టాలు
- బుల్లెట్ ట్రైన్ ప్రకటనతో సర్వత్రా హర్షం

వికారాబాద్, మే 16: వికారాబాద్ రైల్వేస్టేషన్ సుందరీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 26వ తేదీన దేశప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద పనులను ప్రారంభించారు. ఆ పనులు ప్రస్తుతం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో చురుకుగా కొనసాగుతున్నాయి. ఈ రైల్వే స్టేషన్‌ను ఆధునిక హంగులతో తీర్చిదిద్దనున్నారు. త్వరగా పనులు పూర్తయి వికారాబాద్ రైల్వే స్టేషన్ ప్రజలకు అందుబాటులోకి రానుంది.


వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులు


ముమ్మరంగా కొనసాగుతున్న పనులు

స్టేషన్‌లో కల్పించే సౌకర్యాలు

అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద చేపడుతున్న పనుల్లో ముఖ్యంగా ప్రయాణికులు విశ్రాంతి తీసుకోవడానికి ఏసీ గదులతో పాటు ప్రయాణికులకు మౌలిక సదుపాయల కల్పన, రైల్వే స్టేషన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్లాట్ ఫామ్, టాయిలెట్స్ నిర్మాణాలు, దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాలు కల్పించనున్నారు. రైల్వే స్టేషన్‌లో ఆధునాతన పబ్లిక్ అనౌన్స్‌మెంట్ విధానం, ఎల్‌ఈడీ డిస్‌ప్లేతో స్టేషన్ పేరు కలిగిన బోర్డులు వినియోగదారులకు అనుకూలమైన సూచికల ఏర్పాటు వంటి అదనపు సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.

తీరనున్న ప్రయాణికుల కష్టాలు

వికారాబాద్ రైల్వేస్టేషన్ జంక్షన్ కావడంతో నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి దూర ప్రాంతాలకు ప్రయానిస్తుంటారు. వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు వందలాది మంది యువత ఉద్యోగులు, వారి పనుల నిమిత్తం ఉదయం సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్లి వస్తుంటారు. అయితే మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన చాలా మంది ప్రయాణికులు తిరుమల ఆలయ దర్శనానికి వికారాబాద్ నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటి వరకు వారు స్టేషన్‌లో సరైన సౌకర్యాలు లేక పట్టణంలోని గాంధీ పార్కు చెట్ల కింద కూర్చొని రైలు సమయానికి ఎక్కి వెళ్తున్నారు. ఇకపై వికారాబాద్ స్టేషన్‌లో ఏసీ గదులు, విశ్రాంతి గదుల్లో ఉండే అవకాశం లభించనుంది. ఎంత త్వరగా పనులు పూర్తయితే అంత త్వరగా ప్రయాణికుల కష్టాలు తీరే అవకాశం ఉంటుంది. ఇప్పటికే స్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యాలను కల్పించారు.


పార్కింగ్ వద్ద జరుగుతున్న పనులు

బుల్లెట్ ట్రైన్‌పై ఆశలు

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రచారంలో వికారాబాద్ వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వికారాబాద్ స్టేషన్‌లో బుల్లెట్ ట్రైన్ ఆగుతుందని ప్రకటించారు. రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులతో పాటు వికారాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ వచ్చి ఆగుతుందని ఆయన ప్రకటించడంతో జిల్లా ప్రజల్లో కొత్తఆశలు చిగురించాయి. ఈ ప్రకటనపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వికారాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ముంబై, విశాఖపట్నం, తిరుపతి వంటి మహానగరాలకు వెళ్లే సౌకర్యాలు ఉండటంతో ప్రయాణం మరింత సులువు అవుతుందని ప్రజలు భావిస్తున్నారు.



ఆధునికీకరణ పనుల తర్వాత వికారాబాద్ రైల్వేస్టేషన్ బ్యూటిఫికేషన్ నమూనా చిత్రాలు

'పట్నం' డిపోలో ప్రగతి రథచక్ర అవార్డుల ప్రదానం

ఇబ్రహీంపట్నం, మే 16: వృత్తి పట్ల గౌరవం, విధుల్లో మంచి నడవడిక చూపిన వారికి టీఎస్ ఆర్టీసీ గుర్తింపునిస్తుందని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ సుచరిత, ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకట నర్సప్ప అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం డిపోలో మంచి ఆదాయం, ప్రయాణికులతో నడవడిక, హాజరు తదితర అంశాల్లో గుర్తించిన 14 మంది కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లకు ప్రగతి రథచక్ర అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెలా డిపో స్థాయిలో ఈ అవార్డులు ఉంటాయని, మూడు నెలకోసారి రీజియన్ స్థాయిలో, ఆరు నెలలకోసారి జోనల్ స్థాయిలో, ఏడాదికోసారి రాష్ట్రస్థాయిలో ఈ అవార్డులు ఉంటాయని వారు చెప్పారు. సంస్థకు ప్రయాణికులే పట్టుగొమ్మలని, వారిని గౌరవించి సురక్షితంగా గమ్యానికి చేర్చాల్సిన బాధ్యత ఆర్టీసీ సిబ్బందిదేనని వారు అన్నారు. కార్యక్రమంలో ఏఎంఎస్ రామకృష్ణారెడ్డి, ఎస్‌టీఐ వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు అందుకున్న సిబ్బందితో డీఆర్ఎం సుచరిత, డీఎం వెంకటనర్సప్ప తదితరులు

త్వరలో మహేశ్వరం మున్సిపాలిటీ?

- ప్రత్యేక జీవో ఇప్పించే యత్నంలో అధికార పార్టీ నాయకులు
- పంచాయతీకి దూరం కానున్న పలు పల్లెలు

మహేశ్వరం, మే 16 : మహేశ్వరం మండల కేంద్రంతో పాటు మండలంలోని సిరగిరిపురం, గంగారం, గంగారం తండా, మన్‌సాన్‌పల్లి, ఉప్పుగడ్డతండా, కొత్తతండా, కేసీతండా, డీజీతండా, ఎన్డీతండా, కేబీతండా, తుమ్మలూరు, మొహబత్‌నగర్ గ్రామాలను కలుపుకొని మహేశ్వరం కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పాటు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు సాగుతున్నాయి. మహేశ్వరం మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాలు, తండాలు కలుపుకొని మొత్తం 18 వేలకు పైగా జనాభా ఉంటుంది. వచ్చే జూన్, జూలై మొదటి వారంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు, జూలై, ఆగస్టులో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు, అక్టోబరు తరువాత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని సమాచారం. ఈ ఎన్నికల కోడ్ రాకముందే మహేశ్వరాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసే పనిలో కొందరు అధికార పార్టీ నాయకులు బిజీగా ఉన్నారు. దశాబ్దాలుగా పంచాయతీలుగా ఉన్న పల్లెలు ఆ పిలుపులకు దూరమై మున్సిపాలిటీలో వార్డులుగా మారనున్నాయి. మున్సిపాలిటీ ఏర్పాటవుతుందనే వార్తలు మహేశ్వరం వాసుల్లో తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. పంచాయితీలుగా ఉన్న తుక్కుగూడ, రావిరాల, సర్దార్‌నగర్, మంఖాల్ గ్రామాలను కలుపుకొని తుక్కుగూడ కేంద్రంగా ఐదేళ్ల క్రితం మున్సిపాలిటీగా తయారైంది. అదే తరహాలోనే ఇప్పుడు మహేశ్వరాన్ని కూడా మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని, అందుకోసం ముఖ్యమంత్రి అనుమతి కోరాలని కొందరు కాంగ్రెస్ నాయకులు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్‌పై ఒత్తిడి తెస్తున్నారనే వార్తలొస్తున్నాయి. రియల్ ఎస్టేట్‌తో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన మహేశ్వరం.. గ్రామ పంచాయితీగానే ఉంటే అభివృద్ధి కుంటుపడుతందని కొందరు, మున్సిపాలిటీగా ఏర్పడితే పేదలకు ఇబ్బందిగా ఉంటుందని మరి కొందరు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వద్ద ప్రతిపాదనలు పెట్టారనే సమాచారం వినిపిస్తోంది. చాలా వరకు మహేశ్వరాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తేనే బాగుంటుందని.. అప్పుడే మహేశ్వరం అభివృద్ధిలో మరింత పరుగులు పెడుతుందని కాంగ్రెస్ నాయకులు అధినాయకత్వానికి వినిపించారు. మహేశ్వరాన్ని మున్సిపల్‌గా ఏర్పాటు చేయాలని, అందుకు జీవో ఇచ్చేలా అధికారులకు ఆదేశాలివ్వాలని ముఖ్యమంత్రితో చర్చించాలని కేఎల్లార్‌పై నాయకులు ఒత్తిడి పెంచారు. ఈ నేపథ్యంలో మహేశ్వరం త్వరలో మున్సిపాలిటీగా అవతరించనుందనే వార్తలు జోరందుకున్నాయి.


మహేశ్వరం గ్రామ విహంగ వీక్షణం

డెంగీని నివారించి రాష్ట్రాన్ని ఆరోగ్యకరంగా తీర్చిదిద్దుదాం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బీవీ.రావు

- జిల్లా వైద్యాధికారి బీవీ.రావు

మొయినాబాద్, మే 16: డెంగీ వ్యాధిని నివారించి తెలంగాణను ఆరోగ్యకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుదామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బీవీ.రావు అన్నారు. గురువారం మొయిమునాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డెంగీ నివారణలో వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. డెంగీని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించి వ్యాధి నివారణకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఐవోపీవో డాక్టర్ రాకేశ్, చేవెళ్ల డిప్యుటీ డీఎంహెచ్‌వో దామోదర్, వైద్యులు వాణి, రాఘబాబు, వరలక్ష్మి, శ్రీనివాస్‌రావు, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కలను సంరక్షించాలి

చౌదరిగూడ, మే 16: నర్సరీలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం పెద్దఎల్కిచర్ల నర్సరీని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండకుండా నీరందించాలన్నారు. మొలక రాని బ్యాగుల్లో మళ్లీ గింజలు వేయాలని వన సంరక్షకులకు సూచించారు. మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.


నర్సరీని సందర్శిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి, మే 16 : వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా సేకరించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలను దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వడ్లను పూర్తిగా ఎండబెట్టిన కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చేలా రైతులకు సూచించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన వెంటనే మిల్లులకు చేరే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణబాయిలు ఉన్నారు.

బొంరాస్‌పేట్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ నిర్వాహకులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. చిరుజల్లులు కురుస్తుండగా రైతులు ధాన్యాన్ని టార్పాలిన్‌లతో కప్పుతుండగా పరిశీలించారు. ఐకేపీ మహిళలతో ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణను పూర్తి చేయాలన్నారు. హమాలీల కొరతను తీర్చేందుకు అవసరమైన లేబర్‌లను సమకూర్చుకోవాలన్నారు. ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు ఇవ్వాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులను సంప్రదించి గన్నీబ్యాగులను సమకూర్చుకోవాలన్నారు. రైతులు వాతావరణ పరిస్థితులను అంచనావేస్తూ ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. 17శాతం తేమ ఉన్న వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి లారీల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. ఉన్నతాధికారుల సాయం కోసం సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డీసీయంఎస్ నాగమణి, డీసీఎస్‌వో రాజేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ రవి, సీసీ యాదయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఆమనగల్లు ఆసుపత్రి భవనం

- టెండర్లకే పరిమితమైన నూతన బిల్డింగ్
- రోగులు, వైద్య సిబ్బందికి తప్పని తిప్పలు
- నిర్మాణ పనులు ప్రారంభించాలి : స్థానికులు

ఆమనగల్లు, మే 16: ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. 40ఏళ్ల క్రితం నిర్మించిన భవనం.. వర్షం వస్తే జలమయమవుతోంది. భవనంలో రోగులకు, వైద్య సిబ్బందికి సరైన వసతులు కూడా లేవు. మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిపడా లేవు. దశాబ్దాల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా నిర్మించిన భవనం ప్రస్తుత అవసరాలకు సరిపడడం లేదు. దీంతో రోగులు ఏళ్ల కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది. భవనం నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. దాంతో 2023 ఆగస్టు 18న అప్పటి ప్రభుత్వం భవన నిర్మాణానికి వైద్య విధాన పరిషత్ ద్వారా రూ.17.50 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుత ఆసుపత్రి భవనం స్థానంలోనే నూతన భవన నిర్మాణానికి 2023 అక్టోబరు 1న అప్పటి వైద్యఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. దాంతో భవన నిర్మాణం జరిగి ఇబ్బందులు తొలగుతాయని రోగులు, ఈ ప్రాంత ప్రజలు ఆశించారు. తీరా ఏడు నెలలు పూర్తైనా నేటికీ భవన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. టెండర్ ప్రక్రియ పూర్తయి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం మారడం, ఆసుపత్రికి వేరే చోట అనువైన స్థలం లభించకపోవడం భవన నిర్మాణ పనుల్లో జాప్యానికి కారణంగా సమాచారం. యాభై పడకల భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అనంతరం వంద పడకలకు పెంచి భవన నిర్మాణాన్ని ప్రారంభించేలా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చర్యలు చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న భవనాన్ని తొలగించి అదే స్థానంలో నూతన భవన నిర్మాణానికి వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పన అభివృద్ధి సంస్థ అధికారులు కార్యాచరణ రూపొందించారు. భవన నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఆసుపత్రి భవనం

వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం



ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణం పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తాం. టెండర్ పూర్తైంది. ప్రభుత్వం మారడం, వేరే చోట భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం దొరకకపోవడంతో పనుల్లో ఆలస్యమైంది. ప్రస్తుత ఆసుపత్రి ఆవరణలోనే నూతన భవన నిర్మాణం చేపడుతాం.

\- రవీందర్, టీఎస్ఎమ్ఐడీసీ డీఈ, రంగారెడ్డి

అధునాతన భవనాన్ని నిర్మిస్తాం



నాలుగు మండలాల కూడలిగా ఉన్న ఆమనగల్లులో అధునాతన ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని నిర్మిస్తాం. మంజూరైన నిధులకు తోడు అవసరమైతే మరిన్ని నిధులిచ్చేలా సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పిస్తాం. వంద పడకల ఆసుపత్రి భవనం నిర్మిస్తాం.

\- కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే, కల్వకుర్తి

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి



ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేయాలి. ఆసుపత్రులను తీర్చిదిద్దాలి. ఆమనగల్లు ఆసుపత్రికి అనువైన భవనం నిర్మించి మెరుగైన వైద్యసేవలందించాలి.

\- అండెకార్ యాదిలాల్, ఆమనగల్లు

త్వరలో స్థానిక సమరం

- త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు
- నెలాఖరులో నోటిఫికేషన్‌కు ఛాన్స్
- జూలై మొదటి వారంలో ఎలక్షన్?
- 18న క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం
- ఎన్నికలపై ఇప్పటికే ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి
- దగ్గరపడుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం

తాండూరు, మే 16: స్థానిక ఎన్నికల సమరానికి సమయం ఆసన్నమవుతోంది. పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వాహణ దిశగా మొగ్గు చూపుతోంది. పార్లమెంటు ఫలితాలు అనుకూలంగా ఉన్నా, వ్యతిరేకంగా ఉన్నా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్న చర్చకొనసాగుతోంది. ఈనెల 18వ తేదీన నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థలైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్, ఎంపీటీసీ, జడ్పీటీసీల వారీగా వివరాలను సేకరించిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే జూన్ చివరి వారం లోపు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయని గ్రామాల్లో కష్టపడి ప్రజాసమస్యలను తెలుసుకుని పరిష్కరించిన కార్యకర్తలకే టిక్కెట్ల కేటాయింపు ఉంటుందని ప్రకటించారు. మెటీరియల్, ఇతర సామగ్రి విషయంలో అధికార యంత్రాగం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. 2019 ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఉన్న రిజర్వేషన్లు, ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వంటి వివరాలను రాబట్టే పనిలో అధికార యంత్రాగం తలమునకలై ఉంది. జూన్ 3వ తేదీతో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీ కాలం ముగియనుంది.


మండల పరిషత్ కార్యాలయం

25 తర్వాత షెడ్యూల్ విడుదలయ్యే ఛాన్స్

జూలై మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించాలనుకుంటే ఈనెల 25వ తేదీ తర్వాత ఎన్నికల షెడ్యుల్ ఎప్పుడైనా విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. చివరి వారంలో నిర్వహించాలనుకుంటే జూన్ 10వ తేదీ లోపు షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ఎన్నికల నిర్వాహణకు 45 రోజుల గడువు అవసరం. ఈ విషయం ఈనెల 18 తర్వాత స్పష్టమయ్యే అవకాశాలున్నాయి.

సేమ్ రిజర్వేషన్లు?

2018 పంచాయతీరాజ్ చట్ట ప్రకారం 10ఏళ్ల వరకు ఒకే రిజర్వేషన్ వర్తించేలా గత ప్రభుత్వం చట్టాన్ని తీసుకువచ్చిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు మార్పుచేసే అవకాశాలు చాలా తక్కువ అవకాశముంది. రిజర్వేషన్స్ మారిస్తే వ్యతిరేకతలతో పలువురు కోర్టులో కేసులు వేసే అవకాశముంటుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. దీంతో ఎన్నికలు మరింత ఆలస్యమయే అవకాశం ఉన్నందున ఇప్పుడు ఉన్న రిజర్వేషన్‌నే కొనసాగించే అవకాశముంది.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తర్వాతే సర్పంచ్ ఎన్నికలు

పార్టీ గుర్తులపై జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తర్వాతే పార్టీలకతీతంగా జరిగే సర్పంచ్ ఎన్నికలను నిర్వహించనున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తింపు జరుగుతాయి. తద్వారా ఎంపీపీ, జడ్పీచైర్మన్లు గెలుపొంది సత్తాచాటాలని సర్కారు భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో పూర్తిగా బలహీనంగా ఉంది. బీజేపీకి గ్రామాల్లో, పట్టణాల్లో అంతగా పట్టులేదు. ఈ క్రమంలో ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీ గెలుపొందేందుకు మంచి అవకాశంగా అధికార కాంగ్రెస్‌పార్టీ భావిస్తోంది. అవకాశం ఇస్తే బీఆర్ఎస్, బీజేపీలు పుంజుకునే అవకాశాలుంటాయని భావిస్తూ ఎన్నికలకు వెళ్లాలని సీఎం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

వేడి నీరు పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

- గీజర్ ఆన్ చేయగా ప్రమాదం
- చికిత్స పొందుతున్న ఇక్ఫాయ్ విద్యార్థిని

శంకర్‌పల్లి, మే 16: గీజర్‌లోని అధిక వేడినీళ్ల ఓ విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థినిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని వనస్థలిపురానికి చెందిన లేఖ్య శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలో గల ఇక్ఫాయ్ వర్సిటీ కాలేజీలో బీబీఏ(ఎల్ఎల్‌బీ) తృతీయ సంతవ్సరం చదువుతోంది. విద్యార్థిని బుధవారం రాత్రి 7:30సమయంలో స్నానం చేసేందుకని వాష్ రూంలోకి వెళ్లి గీజర్‌లోని నీటికి ఒంటిపై పోసుకుంది. అప్పటికే నీరు ఎక్కువ వేడి ఉండడంతో విద్యార్థిని ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. బాధ తట్టుకోలేక అరవడంతో తోటి విద్యార్థినులు చేరుకున్నారు. వెంటనే యాజమాన్యానికి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. లేఖ్యను కాలేజీ యాజమాన్యం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించింది. అక్కడి నుంచి దిల్‌సుఖ్‌నగర్‌లో గల ఓమ్ని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం లేఖ్య చికిత్స పొందుతోంది. గురువారం విషయం తెలుసుకున్న నార్సింగ్ ఏసీపీ రమనాగౌడ్, ఇన్‌స్పెక్టర్ వీరబాబు, ఎస్ఐ కోటేశ్వరరావులు కళాశాలకు చేరుకొని సంఘటనపై ఆరా తీశారు. తోటి విద్యార్థినులతో, కళాశాల యాజమాన్యంతో మాట్లాడి వివరాలు సేకరించారు. మోకిల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థినిపై దాడి జరిగిందంటూ సోషల్ మీడియాలో సర్క్యులేటవుతున్న వార్తలు అసత్యం అని నార్సింగ్ ఏసీపీ రమణాగౌడ్ ఖండించారు.


బొబ్బలెక్కిన లేఖ్య చెయ్యి

భారతీయ సంప్రదాయాలపై అవగాహనుండాలి

మేడ్చల్ టౌన్, మే 16: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన ఉండాలని ఎయిర్ కమాండర్ వీఎం.రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏపీ, తెలంగాణ, రాజస్థాన్ విభాగం ఎన్‌సీసీ కేడర్ కోసం నిర్వహిస్తున్న ఏక్‌భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీఎం.రెడ్డి మాట్లాడుతూ.. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్న భారత్ పట్ల ఎన్‌సీసీ విద్యార్థులకు మరింత అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఏక్ భాతర్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కేడర్ల మధ్య సమన్వయం పెంపొందించి, వివిధ ప్రాంతాల సంస్కృతులు, సంప్రదాయాలు తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వార వంటకాలు, పండుగలు, జీవన శైలి పట్ల పూర్తి అవగాహన కల్పిస్తారని తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ మోసం

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వకపోవడంపై నిరసన

మహేశ్వరం/షాద్‌నగర్ అర్బన్, మే 16 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వమని చెప్పడం ఘోరమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చెల్లిస్తామని మాట మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం మహేశ్వరం నియోజకవర్గం శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా, నిరసన నిర్వహించారు. సబితాఇంద్రారెడ్డి పాల్గొని మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తెల్లారే ధాన్యానికి క్వింటాలుకు రూ.500 రూపాయలు బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో 90 శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారని తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకే బోనస్ చెల్లిస్తామని ప్రకటించడం రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న తొమ్మిదిన్నరేండ్లలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నారని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాక ముందే రైతులను నట్టేట ముంచుతున్నారని అన్నారు. మహేశ్వరం పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్‌చైర్మన్ డి.వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి. అంబయ్యతో పాటు బీఆర్ఎస్ నాయకులు వి.యాదగిరిగౌడ్, శ్రీశైలం, సాదత్, డి.శ్రీనివాస్, దేవ్లానాయక్, సమీర్, నవీన్, సురేష్, కె.ప్రభాకర్, మనోహర్ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు గురువారం షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. కేసీఆర్ పిలుపు మేరకు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ధర్నా చేసి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి.. అనంతరం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, బస్తా ధాన్యం కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు తక్కువ ధరకు ధాన్యం విక్రయిస్తూ నష్టపోతున్నారని అన్నారు. షాద్‌నగర్ సింగిల్ విండో చైర్మన్ బక్కన్న యాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్‌చైర్మన్ నటరాజ్, బీఆర్ఎస్ నాయకులు తాండ్ర వెంకట్‌రెడ్డి, మన్నె నారాయణ, రాయికల్ వెంకట్‌రెడ్డి, బీష్వ రామకృష్ణ, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, చందునాయక్, శ్రీశైలంయాదవ్, ఆలోనిపల్లి శ్రీనివాస్ గౌడ్, రేటికల్ నందీశ్వర్, బొమ్ము రంగయ్య గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మహేశ్వరం : శ్రీశైలం-హైదరాబాద్ హైవేపై ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న సబితారెడ్డి


షాద్‌నగర్ అర్బన్ : ధర్నా చేస్తున్న నాయకులు

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్

ఆమనగల్లు : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా రైతులను, ప్రజలను మోసగిస్తుందని ఆమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలు ముగిశాక సన్నరకాల మాత్రమే బోనస్ ఇస్తామనడం రైతులను వంచించడమేనని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనలు, పోకడలకు పొంతన లేదన్నారు.

రైతాంగ సమస్యలపై బీఆర్ఎస్ నేతల తీరు విడ్డూరం

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి



కందుకూరు, మే 16 : రైతుల సమస్యలు పక్కనపెట్టి రాజకీయాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల తీరు విడ్డూరంగా ఉందని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ధాన్యం తడిస్తే కొనే దిక్కులేకుండా ఉండేదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే రైతులకు పైసా సాయం చేయలేదని అన్నారు. పంట బీమా పథకం అమలు చేయక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు గుర్తుచేశారు. ఖమ్మంలో మిర్చి ధర అడిగినందుకు గిరిజన రైతులకు బేడీలు వేశారని, పత్తిరైతుల ఆత్మహత్యలు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. 100 రోజుల కాంగ్రెస్ పాలనలోనే రైతు భరోసాకు రూ.7వేల 500కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీకి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న తరుణంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

రుణమాఫీకి కట్టుబడిన ప్రభుత్వం


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ

కడ్తాల్, మే 16: రైతుల రుణమాఫీ విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి చర్యలు చేపట్టారని డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. రైతు సమస్యలపై బీఆర్ఎస్ నాయకులకు మాట్లాడే హక్కు లేదన్నారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఒరగబడిందేమీ లేదన్నారు. అధికారం పోయిందన్న అక్కసుతో కేసీఆర్, కేటీఆర్, పలువురు నాయకులు ప్రతీది రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమాన్ని కాంక్షించి సీఎం రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీకి ఇప్పటికే ప్రభుత్వం విధి విధానాలు రూపకల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, కాంగ్రెస్ నాయకులు చేగూరి వెంకటేశ్, శంకర్, రామకృష్ణ, అశోక్, గురిగళ్ల లక్ష్మయ్య, గూడూరు భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజ్, రాజేశ్, ఇమ్రాన్‌బాబా, రాంచందర్ నాయక్, మల్లేశ్‌గౌడ్, యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన యువజన నాయకులు


రేవంత్‌రెడ్డిని కలిసిన రామకృష్ణయాదవ్

యాచారం, మే 16 : వచ్చే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున భారీగా సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను గెలిపించుకునేందుకు కృషి చేయాలని యువజన కాంగ్రెస్ నాయకులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. పార్టీని మరింత బలోపేతం చేయడంపై నాయకులు ప్రధానంగా దృష్టిసారించాలని ఆదేశించారు. గురువారం కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు పొలమోని రామకృష్ణయాదవ్‌తో పాటు పలువురు నాయకులు సీఎంను నగరంలో కలిశారు. ఈసందర్భంగా వారితో సీఎం కొద్దిసేపు మాట్లాడి పార్టీ పరిస్థితిని ఆరా తీసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే యాదయ్య జన్మదిన వేడుకలు


ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల, మే 16 : ఎమ్మెల్యే కాలె యాదయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బీఆర్ఎస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. యాదయ్య మున్ముందు మరిన్ని జన్మదిన వేడుకలను జరుపుకోవాలని భగవంతున్ని కోరుతున్నట్లు నాయకులు పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, వెంకటేశ్, మహేందర్ యాదవ్, జనార్దన్‌రెడ్డి, సాయి తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

మొయినాబాద్ రూరల్, మే 16: క్రీడల్లో ప్రతిభ కనబర్చి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు మాల యాదయ్య క్రీడాకారులకు సూచించారు. మాల యాదయ్య సొంత డబ్బుతో మండల పరిధిలోని హిమాయత్ నగర్ క్రికెట్ జట్టు సభ్యులకు క్రీడా దుస్తులను గురువారం హిమాయత్ నగర్‌లో పంపిణీ చేశారు.



డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి


కొత్తూర్ : అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

కొత్తూర్/షాద్‌నగర్‌అర్బన్/ఆమనగల్లు, మే 16: డెంగీ వ్యాధి పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కొత్తూర్ పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో గురువారం డాక్టర్ హరికిషన్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది డెంగీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు సరిత, మానస, రూన్సీ, ఉదయ్‌కుమార్, రాము, సూపర్‌వైజర్ రవికుమార్, అనసూయ, ఎఎన్ఎంలు సులోచన, లక్ష్మి, సునంద, రేణుక, జ్యోతి, సుజాత, సుమిత్ర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. షాద్‌నగర్ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట డాక్టర్ కార్తీక్ ర్యాలీని ప్రారంభించారు. వైద్య సిబ్బంది దోమ పుట్టరాదు-దోమ కుట్టరాదు అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దోమ కాటు వల్ల ప్రాణాంతకమైన డెంగీ వ్యాధి వస్తుందని, ఇంటి పరసరాలను శుభ్రంగా పెట్టుకుని, దోమలు కుట్టకుండ జాగ్రతగా ఉండాలని సూచించారు. వైద్యులు జగదీష్, సంధ్య, ప్రవీణ, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వర్షాకాలం ప్రారంభం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మంజులా దేవి, డాక్టర్ జయశ్రీ లు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.


షాద్‌నగర్ అర్బన్ : ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ కార్తీక్

ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ చేపట్టారు. ఎంపీహెచ్ఈవో తిరుపతిరెడ్డి, పీహెచ్ఎన్ లక్ష్మి, సిబ్బంది శ్రీను, ఇందిర తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : ర్యాలీలో వైద్యులు, సిబ్బంది

వైభవంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న ఎంపీటీసీ దంపతులు

షాబాద్, మే 16 : శివపార్వతుల కల్యాణం గురువారం కనుల పండువగా నిర్వహించారు. షాబాద్ మండల పరిధిలోని చిన్నసోలిపేట్ గ్రామంలో శివాలయం ప్రాంగణంలో భాజాభజంత్రీల మధ్య వేద పండితులు శివపార్వతుల కల్యాణం జరిపించారు. ఎంపీటీసీ లతమహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమ్యకృష్ణరాంచంద్రారెడ్డి దంపతులు తీసుకు వచ్చిన తలంబ్రాలు స్వామివారికి పోయించారు. శివనామ స్మరణతో దేవాలయం మార్మోగింది. ఈ సందర్భంగా కల్యాణం చూడడానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

దేవాలయ భూమిని కాపాడాలి : గ్రామస్తులు


కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్ రూరల్, మే 16: ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట భవానీ మాత ఆలయానికి చెందిన భూమి అన్యాక్రాంతమైందని, దానిని కాపాడాలని ఎలికట్ట గ్రామస్తులు గురువారం సాయంత్రం నగరంలో దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. భవానీ మాత ఆలయం పేరుతో సర్వేనెంబర్ 441లో 3 ఎకరాల 28 గుంటల భూమి ఉందని తెలిపారు. 2008లో ఆలయం దేవాదాయ శాఖ అధీనంలోకి వెళ్లిందని, అయితే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, సమగ్ర విచారణ చేసి దేవాలయ భూమిని కాపాడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎంపీటీసీ శ్రీశైలం, నాయకులు ఆర్ల యాదయ్య, రాంరెడ్డి, లక్ష్మయ్య ఉన్నారు.

ఫిజికల్ డైరెక్టర్ల సమస్యలు పరిష్కరించాలి


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

చేవెళ్ల, మే 16 : మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు బేసిక్ పే వర్తింపజేయాలని మోడల్ స్కూల్ పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. గురువారం మోడల్ స్కూల్ పీడీల సంఘం ఆధ్వర్యంలో వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) చైర్మన్ శివ శంకర్‌ను నగంరలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆంజేయులు మాట్లాడుతూ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లను కాంట్రాక్టు విధానంలోకి మార్చి మినిమమ్ టైం స్కేల్ ఇవ్వాలని కోరారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. హవర్లీ బేస్ట్ టీచర్లకు రూ.28 వేల వేతనం ఇవ్వాలని కోరారు. పీడీల సంఘం ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, తెలంగాణ పీఆర్టీయు అధ్యక్షుడు సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మంచిరెడ్డి, అనంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : సామాజిక సేవా కార్యక్రమాల నిర్వాహణలో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిచిందని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ ఎస్. రాధాకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని రాధాకృష్ణ సందర్శించి అంబలి కేంద్రం నిర్వాహణ తీరును ఆయన పరిశీలించి అభినందించారు.

మొయినాబాద్ రూరల్ : విద్యార్థులకు ఉత్తమమైన విద్యనందించడమే తమ విద్యాసంస్థల లక్ష్యమని, ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో తమ విద్యార్థులు సాధించిన ఫలితాలే అందుకు నిదర్శనమని పల్లవి ఇంటర్‌నేషనల్ పాఠశాలల చైర్మన్ మాల్కు కొమురయ్య అన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్ రెవెన్యూలోని పల్లవి ఇంటర్‌నేషన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల సీబీఎస్ఈ(టెన్త్) పరీక్ష ఫలితాల్లో 98 శాతం మార్కులు సాధించారు. ఈమేరకు సహాజ్‌ముక్కా, ఆరాధ్యమెహదీ రట్టా, స్ఫూర్తి కుప్పా, పోతుల ప్రవళిక, ఖోట్టి రోహిత్, సకీనా ఫాతిమాలకు అభినందన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

మంచాల : విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ సూచించారు. 14 ఏళ్లలోపు విద్యార్థినీ విద్యార్థులకు కబడ్డీ, బాలీబాల్‌కు సంబంధించి మంచాలలో నిర్వహించే సమ్మర్ క్యాంపును గురువారం ఆయన ప్రారంభించారు.

యాచారం : చింతపట్ల ఉన్నత పాఠశాలలో 2008-09 టెన్త్ చదివిన విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం మండలంలోని తమ్మలోనిగూడలోని నీరిచ్‌మోండ్ ఫంక్షన్ హాల్‌లో జరుపుకున్నారు. గురువులు యాదయ్య, సత్తయ్య, అంజయ్య, రాజు, మదు మోహన్‌లను ఘనంగా సత్కరించారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

క్రీడలతోనే మానసికోల్లాసం

చేవెళ్ల, మే 16 : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుడ్యం పెరుగుతుందని బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చనువల్లి గ్రామంలో గురువారం క్రికెట్ టోర్నమెంట్‌ను క్రీడకారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాయ్‌బరేలీకి తరలిన మల్లు రవి


ఎయిర్‌పోర్టు నుంచి తరలివెళ్తున్న మల్లు రవి, కాంగ్రెస్ ఎమ్మెల్యే లు

ఆమనగల్లు, మే 16: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి, పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం రాయ్‌బరేలీకి బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న రాయ్‌బరేలీలో ప్రచారం కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి వెళ్లారు. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి, గద్వాల జడ్పీచైర్మన్ సరిత, కాంగ్రెస్ నేతలు మదుసూధన్‌రెడ్డి, గిరివర్ధన్‌రెడ్డి, తిరుపతయ్యలతో కలిసి తొలిరోజు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేసినట్లు మల్లు పేర్కొన్నారు.

న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డికి 'సామాజిక న్యాయ సేవారత్న' పురస్కారం

షాద్‌నగర్ అర్బన్, మే 16: షాద్‌నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు చెంది మహేందర్‌రెడ్డిని బుక్ రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటీ, శ్రీరాగ సినీ మ్యూజికల్స్ సంస్థలు సామాజిక న్యాయ సేవారత్న స్వర్ణ మహానంది పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించాయి. గురువారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల శ్రీ త్యాగరాయ గానసభలో మహేందర్‌రెడ్డికి బుక్ రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు డీవీవీఎస్ నారాయణ ప్రశంసాపత్రం, బంగారు నందిని ఇచ్చి ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండంలోని పెద్ద రేవల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యక్షుడు చెంది వెంకట్‌రెడ్డి-వెంకటమ్మ దంపతులకు 1966 జూల్ 31న జన్మించిన మహేందర్‌రెడ్డి ప్రాథమిక విద్య, ఇంటర్‌ను షాద్‌నగర్‌లో, డిగ్రీని సిటీ కాలేజ్‌లో చదివి, ఎల్ఎల్‌బీని గుల్బార్గా యూనివర్శిటీలో పూర్తి చేసి, షాద్‌నగర్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. షాద్‌నగర్‌లోనే స్థిర నివాసాన్ని ఏర్పర్చుకున్న మహేందర్‌రెడ్డి విద్యార్థి దశ నుంచి ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ విభాగాల్లో పనిచేస్తూ బీజేపీ నాయకుడిగా ఎదిగి కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడిగా కొనసాగుతున్నారు. రాజకీయ నాయకుడిగా, న్యాయవాదిగా సేవలందిస్తున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

యాచారం, మే 16 : లారీ డ్రైవర్ నిర్లక్ష్యం మూలంగా ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన గురువారం యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాల్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలోని కోదాబక్ష్‌పల్లికి చెందిన అంతయ్య(60) లూనా వాహనంపై యాచారం నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈక్రమంలో మహా సిమెంట్ కంపెనీకి చెందిన ఓ లారీ లూనాను ఢీకొట్టింది. దాంతో తీవ్రంగా గాయపడగా.. స్థానికులు మాల్‌లో పీపుల్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రాణాలు కోల్పోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు లక్ష్మయ్య అనారోగ్యం కారణంగా నెల రోజులుగా నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అంతయ్య మరణంతో వారి కుటుంబం వీధిన పడింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడి బంధువులు కోరుతున్నారు.

పాంపాండ్‌లో మునిగి ఒకరు..

తలకొండపల్లి, మే 16: పాంపాండ్‌లో స్నానానికి వెళ్లిన ఓ వ్యక్తి అందులో మునిగి మృతిచెందిన ఘటన తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకుల కథనం మేరకు.. చంద్రధన శ్రీ మల్లికార్జున బ్రహ్మోత్సవాల సందర్భంగా మహబూబ్‌నగర్‌కు చెందిన భవానిజీ(45) రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. గురువారం తెల్లవారుజామున పొలం వద్ద పాంపాండ్‌లో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడు భవానీజీ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

కొత్తూర్, మే 16: మండల కేంద్రానికి సమీపంలో గల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఉల్లిగడ్డల శివ(43) అనే వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లికి చెందిన శివ గురువారం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొనడంతో శివకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. శివ భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తితో దాడి కేసులో ముగ్గురి రిమాండ్

శంషాబాద్, మే 16 : శంషాబాద్ ఎయిర్‌పోర్టు బావర్చి హోటల్ వద్ద జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేసి గాయపర్చిన కేసులో ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు. కాగా, ఎయిర్‌పోర్టు బావర్చి హోటల్ వద్ద బుధవారం రాత్రి పార్కు చేసిన బైక్‌ను పక్కకు తీయమని ముగ్గురు వ్యక్తులు గొడవ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో గొడవ పడొద్దని వారించిన సిద్ధాంతి బస్తీకి చెందిన ఆటోడ్రైవర్ సురేష్‌ను ఉమర్ కత్తితో దాడిచేసి గాయపర్చాడు. అతడితో పాటు ఉన్న తౌసిఫ్ హైమద్ మీర్జాలు నాయక్ అనే మరో వ్యక్తిపై దాడి చేసి గాయపర్చారు. ఈ ముగ్గురు నిందితులు శంషాబాద్ మున్సిపాలిటీలోని హైమద్‌నగర్ బస్తీకి చెందినవారు. ఈమేరకు పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు.

యువకుడు అదృశ్యం.. కేసు నమోదు

కొత్తూర్, మే 16: మండల కేంద్రంలో నివసిస్తున్న బికాస్‌దాస్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు. మతిస్థిమితం లేని బికాస్‌దాస్ ఇంట్లో ఎవరులేని సమయంలో ఈనెల 6న బయటకు వెళ్లాడు. ఆచూకీ కొరకు కుటుంబసభ్యుల వెతికినా ఫలితం లేకపోయిందన్నారు. యువకుడి తండ్రి బెన్నుదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 8712568296 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- రెండున్నర తులాల బంగారం.. రూ.50వేల అపహరణ

కందుకూరు, మే 16 : తాళం వేసి ఉన్న ఇంటికి కన్నం వేసి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు దొంగిలించిన ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు గురువారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నేదునూరు గ్రామానికి చెందిన కొమ్ము జంగయ్య కుటుంబ సభ్యులతో బుధవారం రాత్రి ఇంట్లో భోజనం చేసిన అనంతరం ఇంటికి తాళం వేసి స్లాబ్‌పై నిద్రించారు. గురువారం తెల్లవారుజామున జంగయ్య భార్య నవనీత ఉదయం చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలో వస్తువులు, బట్టలు చిందరవందరగా ఉన్నాయి. కందుకూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదును దొంగించినట్లు ఫిర్యాదు చేసిన ట్లు సీఐ మక్బూల్‌జానీ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రన్నింగ్ బస్సులో నుంచి దూకిన మహిళ

- భర్తతో గొడవే కారణం.. స్వల్ప గాయాలు
- ఆసుపత్రికి తరలించిన ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం

కొందుర్గు, మే 16 : రన్నింగ్‌లో ఉన్న ఆర్టీసీ బస్సులో నుంచి ఓ మహిళ కిందికి దూకడంతో స్వల్ప గాయాలైన ఘటన మండల పరిధిలోని శ్రీరంగాపూర్ శివారులో జరిగింది. కొడంగల్ మండల పరిధిలోని హస్నాబాద్‌కు చెందిన మరియమ్మ, భర్త దస్తగిరితో కలిసి గురువారం సాయంత్రం కొందుర్గు నుంచి షాద్‌నగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఈక్రమంలో భార్యాభర్తలు ఏదో విషయమై గొడవపడ్డారు. మండల పరిధిలోని శ్రీరంగాపూర్ శివారులోకి రాగానే మరియమ్మ హఠాత్తుగా బస్సులో నుంచి దూకిందని తోటి ప్రయాణికులు తెలిపారు. దాంతో మరియమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం ఆటోను రప్పించి మరియమ్మను షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏసీపీకి ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కొందుర్గు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బావిలో ఈతకు వెళ్లి వ్యక్తి గల్లంతు


శవం కొరకు గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

మాడ్గుల, మే 16 : బావిలో ఈతకు వెళ్ళిన వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని కొల్కులపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్కులపల్లి ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు భట్టు కిషన్‌రెడ్డికి చెందిన బావిలో నర్సాపల్లి గ్రామానికి చెందిన బైకని కొమరయ్య(35)అనే వ్యక్తి గురువారం ఈత కొట్టటానికి వెళ్ళి నీటిలో మునిగిపోయాడు. అక్కడే ఉన్న మరికొందరు గమనించి డయల్ 100కు కాల్ చేయడంతో వారు ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి వచ్చి శవాన్ని బయటికి తీయటానికి యత్నించినా ఫలితం లేకపోయినట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. వర్షం కారణంగా బయటకు తీయలేకపోయామన్నారు. రాత్రి వరకూ యత్నించి, తిరిగి శుక్రవారం ఎలాగైనా బయటకు తీస్తామన్నారు. కాగా, మద్యం సేవించిన కొమరయ్య బావిలో ఈత కొట్టేందుకు దూకినట్లు అంతకుముందు అక్కడ ఈత కొడుతున్న యువకులు తెలిపారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి


కృష్ణ(ఫైల్)

మొయినాబాద్ రూరల్, మే 16 : గుండెపోటులో బీఆర్ఎస్ కార్యకర్త మృతిచెందిన ఘటన మండలంలోని ఎన్కేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్కేపల్లికి చెందిన న్యాలట కృష్ణ(43) స్థానికంగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి ఎప్పటిలాగే కృష్ణ భోజనం చేసి పడుకునే సమయానికి గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కృష్ణ కొన్ని సంవత్సరాలుగా బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ఎన్కేపల్లి అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. భార్య సువర్ణ, ఇద్దరు కుమారులున్నారు.